ఈనాడు హనుమకొండ

శనివారం సెప్టెంబరు 28, 2024



అమ్మాయిలు అదరగొట్టారు..

హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సినిమా పాటలకు స్టెప్పులేసి అదరగొట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యవర్గాన్ని అభినందించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ఎం.నరసింహారావు, డి.ప్రభాకరాచారి, ఎం.రణధీర్‌కుమార్, విద్యార్థి యాక్టివిటీ సెంటర్ ప్రతినిధులు శ్రీగౌరి జాహ్నవి, ఎం.సాకేత్, ఎం.కిరిల్ ప్రవర్ష, ఆసిఫ్ అబూబకర్, పావని, భరత్ కుమార్‌రెడ్డి, సిద్ధార్థ, నిషాత్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ముచ్చర్ల(భీమారం)



ఆకేరు పొడవునా.. ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!

ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఈనాడు, మహబూబాబాద్,

రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా	
ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్‌లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

నష్కల్ – ఉప్పుగల్లు – కూనూరు – నందనం – రాంనగర్ – వర్ధన్నపేట – ఇల్లంద – కొత్తపల్లి – ల్యాబర్తి – పర్వతగిరి – నెల్లికుదురు – జయపురం – చిన్న గూడూరు – ఉగ్గంపల్లి – ముల్కలపల్లి



120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.

● జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.

● ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారుల అండదండలతోనే రవాణా జరిగేదని ఆరోపణలున్నాయి. ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇక్కడే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

● వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతాలలోని వాగు నుంచి ప్రతి రోజూ 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్లు వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాహనాలలో నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.



ఇల్లంద సమీపంలో



కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..



ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టు కాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.

● పర్వతగిరి మండలం చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. తర్వాత తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు సిద్ధమవుతున్నారు. అధికారులు తమను అడ్డుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలిసేందుకు సన్నద్ధమవుతున్నారు.



నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు



నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.



● నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునిగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరద నీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్ శాఖకు అప్పగించారు

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూ శాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

ముగిసిన ఉత్కర్ష ఉత్సవాలు



పూర్వ ప్రిన్సిపాళ్లతో వైద్య విద్యార్థులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కాకతీయ వైద్య కళాశాలలో ఉత్కర్ష-24 ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. వారం పాటు సాగిన ఉత్సవాల ముగింపు సందర్భంగా వైద్య విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డితోపాటు పూర్వ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏఎన్ఆర్ లక్ష్మి, డాక్టర్ రమేష్‌రావు, డాక్టర్ సంధ్యారాణి, పూర్వ విద్యార్థి(1967 బ్యాచ్) డాక్టర్ హనుమంతరావు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆయా పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు పూర్వ ప్రిన్సిపాళ్లను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పూర్వ ప్రిన్సిపాళ్లు ఆడిపాడి అలరించారు.

త్యాగమూర్తి లక్ష్మణ్ బాపూజీ



లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావిణ్య, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వరాష్ట్రం కోసం జీవితాన్నే ధారపోసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావిణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం మంత్రి పదవిని వదులుకున్న త్యాగమూర్తి అని కొనియాడారు. అనంతరం ఆయన సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా అధ్యక్షుడు ఆనందం, నాయకులు వేణు, కృష్ణప్రసాద్, కుసుమ శ్యాం సుందర్, అధికారులు పాల్గొన్నారు.

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!

జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.



పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

జనగామ జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం

'పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?' 6 లో..

బిల్లుల చెల్లింపులో రాజకీయ పెత్తనం!

న్యూస్‌టుడే, కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్‌లో అభివృద్ధి పనులు చేసేందుకు సివిల్ గుత్తేదారులు ముఖం చాటేస్తున్నారు. ఇక్కడ పనులు చేయడం ఒక ఎత్తయితే, బిల్లులు పొందడం మరో ఎత్తవుతోందని వాపోతున్నారు. రాజకీయ పలుకుబడి, సిఫార్సులుంటే తప్ప అభివృద్ధి పనులు బిల్లులు రావడం లేదని వాపోతున్నారు. నిబంధనలు పాటించడం లేదని, సీరియల్ సిస్టమ్ అమలు పరచడం లేదంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ పెత్తనం పెరిగిందనే విమర్శలున్నాయి. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువైందంటున్నారు. గతంలో పనిచేసిన ఐఏఎస్ కమిషనర్లు బిల్లుల చెల్లింపుల్లో సీరియల్ పద్ధతి అమలు చేశారు. రెండు, మూడేళ్లుగా పరిశీలిస్తే ఇది పాటించడం లేదు. సిఫార్సులు, పైరవీలకే ఉన్నతాధికారులు మొగ్గు చూపుతున్నారని అర్థమవుతోంది.

ఇవిగో ఉదాహరణలు

● బల్దియాలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఓ గుత్తేదారు రెండు, మూడు నెలల్లో సుమారు రూ.2 కోట్ల బిల్లులు పొందారని తెలిసింది.

● ఇద్దరు గుత్తేదారులు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు చిన్నా చితక నామినేషన్ పనులు చేస్తారు. వీళ్లకు ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నారు. పాలకవర్గం పెద్దల అండ ఉందని ప్రచారం సాగుతోంది.

● హనుమకొండ ప్రాంతంలోని కొందరు గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాలని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ప్రజాప్రతినిధి పేరు చెప్పి జాబితా పంపించారని తెలిసింది.

● సీఎం హామీల పథకంలో ఇద్దరు గుత్తేదారులు రూ.కోటి మేర పనులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వమని తిరస్కరించింది. బల్దియా జనరల్ ఫండ్స్ ద్వారా రూ.65 లక్షల బిల్లులు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి ద్వారా సిఫారసు వచ్చింది. బిల్లులు చెల్లించేందుకు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు.

ఆయనకు తుపాకీ కావాలట..!

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ నగర పరిధిలో ఓ మాజీ రౌడీషీటర్ తుపాకీ లైసెన్సు కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఆయనకు ఇద్దరు గన్‌మెన్లు ఉన్నారు. ఏ పదవి లేకున్నా తనకు ప్రాణభయం ఉందంటూ గత పాలకుల మద్దతుతో గన్‌మెన్లను పొందారు. తాజాగా తుపాకీ లైసెన్సు కోసం వరంగల్ జిల్లా గీసుగొండ పోలీసు స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారు. ప్రస్తుతం అది పరిశీలన కోసం మామునూరు ఏసీపీ కార్యాలయానికి చేరినట్లు సమాచారం. పరకాల నియోజకవర్గానికి చెందిన సదరు వ్యక్తి వరంగల్ తూర్పులో అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో అన్నీ తానై వ్యవహరిస్తుంటారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన వారికి.. పాత తరం నాయకులకు పంచాయితీ జరుగుతోంది. ఈనెల 23న వరంగల్ ఎల్బీనగర్‌లోని ఓ వేడుకల మందిరంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ వ్యవహారంలో 21వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్‌నకు తాజాగా కాంగ్రెస్‌లో చేరిన వారికి గొడవ జరిగి పంచాయితీ పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. ఈ వ్యవహారంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు తనను చితకబాదాడని సందీప్.. సీపీ అంబర్‌కిషోర్ ఝాకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ గొడవలకు సదరు మాజీ రౌడీషీటర్ కారణమని ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. సీపీ ఆదేశాలతో గురు, శుక్రవారాలు డీసీపీ సలీమా సారథ్యంలో ఈ విషయంపై విచారణ జరిగింది. ఇలా ఫిర్యాదులు వస్తున్న క్రమంలో సదరు వ్యక్తికి తుపాకికి అనుమతిస్తే ఆయన బాధితులు మరింత భయభ్రాంతులకు గురి కావాల్సిందేననే ఆందోళన వ్యక్తమవుతోంది.

బతుకమ్మ సంబరం.. ముందస్తు మురిపెం



కాకతీయ విశ్వవిద్యాలయంలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శుక్రవారం కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ అమరవేణి ఆధ్వర్యంలో విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతకమ్మలను పేర్చి ఆడిపాడారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మ అన్నారు. ఆచార్య ఎస్.నరసింహచారి, అధ్యాపకులు ప్రగతి, సౌజన్య పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విద్యానగర్

'ములుకనూరు' సభ్యులకు రూ.3 కోట్ల బోనస్



వార్షిక మహాసభకు హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: ములుకనూర్ సహకార సంఘ సభ్యులకు దసరా బోనస్‌గా రూ.3 కోట్లు పంపిణీ చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్రకటించారు. భీమదేవరపల్లి మండలం ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం 68 వార్షిక మహాసభను శుక్రవారం పారాబాయిల్డ్ రైస్‌మిల్లు ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ వ్యవస్థాపకుడు అల్గిరెడ్డి విశ్వనాథరెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులు, ఎరువులు, బియ్యం తదితర వ్యాపారాలతో ఈ ఏడాది రూ.7.07 కోట్ల లాభాలు సాధించినట్లు తెలిపారు. రుణాల కింద పంట ఉత్పత్తులు విక్రయించిన రైతులకు ఆర్ఎన్ఆర్, బీపీటీ ధాన్యంకు క్వింటాకు రూ.200, పత్తికి రూ.300, విత్తన ధాన్యానికి రూ.125, దొడ్డు రకం ధాన్యానికి రూ.100 చొప్పున బోనస్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మృతి చెందిన 160 మంది సభ్యులకు సంబంధించిన రుణాలు రూ.కోటి మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. వివిధ సంక్షేమ పథకాలకు చేసిన ఖర్చును వివరించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. మహిళా డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు కనకయ్య, జయపాల్‌రెడ్డి, వీరారెడ్డి, ఆదాం, కనకమ్మ, భాగ్య, వీరయ్య, బుచ్చయ్య, బాషు, రవీందర్‌రెడ్డి, మూగయ్య, మహేందర్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


పది నెలలైనా ఫలితాలు ఏవీ?

● పరీక్ష రాసి ఎదురు చూస్తున్న దూరవిద్య అభ్యర్థులు

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న కోర్సుల పరీక్షలు నిర్వహించిన పది నెలలు అయింది. కాకతీయ విశ్వవిద్యాలయం అధికారులు ఇప్పటి వరకు ఫలితాలు వెల్లడించలేదు. రెగ్యులర్ కోర్సు ఫలితాలు సకాలంలో విడుదల చేసేవారు.. దీనిపై ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని దూరవిద్య కోర్సు పరీక్షలు రాసిన అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దూరవిద్య ఎంఎల్ఐఎస్సీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు గతేడాది నవంబర్ 16, 18, 20, 23 తేదీల్లో నిర్వహించారు. మొత్తం 97 మంది హాజరయ్యారు. అధికారులు దృష్టిసారిస్తే వీరి ఫలితాలను పది రోజుల్లో ఇవ్వవచ్చు. కానీ పది నెలలైనా వెల్లడించలేదు.

అంతర్గత మార్కులు ఇవ్వడంలో జాప్యం..

థియరీ పరీక్షలకు 80, అంతర్గత (ఇంటర్నల్) పరీక్షలకు 20 మార్కులు ఉంటాయి. 97 మంది విద్యార్థుల అంతర్గత మార్కులను దూరవిద్య కేంద్రం వారు కేయూ పరీక్షల నియంత్రణ విభాగానికి పంపించకపోవడంతో జాప్యం అయిందని పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నారు. జవాబుల పత్రాల మూల్యాంకనం పూర్తి చేశామని, అంతర్గత మార్కులు రాగానే ఫలితాలను వెల్లడిస్తామని కేయూ పరీక్షల నియంత్రణ అదనపు అధికారి ఎ.నరేందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.
- ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు 'ఘన' స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసు కట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వెయ్యిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మిస్తున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలను నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. - ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.
- న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

- సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాల పాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబర్ 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై వేట కుక్కలతో దాడి చేయించారు.
- 2022 సెప్టెంబర్‌లో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబర్‌లో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడురైతులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

- జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
- పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అక్కడ అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

సంవత్సరం	ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరు పర్చనున్నారు.



ఆర్‌అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

- గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

ఆ ఇంటి యజమానికి నోటీసులు



భవనాన్ని పరిశీలించి, పట్టాదారుతో మాట్లాడుతున్న అధికారులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇంటిని తహసీల్దార్ సదానందం, దేవాదుల ఎత్తిపోతల పథకం డీఈఈ ప్రశాంతి, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పరిశీలించారు. 'చెరువులోనే భవనం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఇల్లు కట్టిన సర్వే నెంబరుతో పాటు పరిసరాల రైతుల పట్టా భూములను సోమవారం పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని చెప్పారు. ధర్మసాగర్ పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ మహేందర్‌రెడ్డిలు ఆ ఇంటి యజమానికి నోటీసు జారీ చేశారు. పంచాయతీ నుంచి గానీ, కుడా నుంచి గాని ఏవిధమైన అనుమతి లేకుండా ఇల్లు ఎలా నిర్మించారని, దీనికి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా నిర్ధారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, సర్వేయర్ సురేందర్, దేవాదుల ఎత్తిపోతల పథకం ఏఈఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆందోళన



హనుమకొండ డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించడానికి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 274 మంది ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 16 ఏళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అర్హులైన అభ్యర్థులు హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో కంగుతిన్నారు. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులకు కనీసం సమాచారం అందించే వారేలేరని వాపోయారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వేచి చూసిన వారంతా అక్కడే ఆందోళన చేశారు. ఎంతో ఆశతో వస్తే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యాశాఖ అధిశాఖ సిబ్బంది అప్పటికప్పుడు ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఒప్పంద పద్ధతిలో ఉద్యోగాలు చేసేందుకు అంగీకారం తెలిపిన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండ విద్యార్థి ఆత్మహత్య



భుక్య అక్షిత్ (పాతచిత్రం)

ఈనాడు, వరంగల్ : అహ్మదాబాద్ ఐఐఎంలో హనుమకొండకు చెందిన విద్యార్థి భుక్య అక్షిత్ (24) గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన అక్కడ ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుజరాత్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 27 నుంచి ఐఐఎం క్యాంపస్‌లో రెడ్ బ్రిక్స్ సదస్సు (టీఆర్‌బీఎస్) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకల్లో అక్షిత్ కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. 25 మంది విద్యార్థులు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తుండగా అక్షిత్ అందులో ఒకరు. ఈ సదస్సుకు గౌతమ్ ఆదానీతోపాటు ప్రముఖ వ్యాపార దిగ్గజాలు హాజరై ప్రసంగించాల్సి ఉంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురైన అక్షిత్ వసతిగృహంలోని తన గదిలో నైలాన్ తాడును ఉపయోగించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన రెడ్ బ్రిక్ సదస్సును ఐఐఎం రద్దు చేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. వస్త్రాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అక్షిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోలా సివిల్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి శుక్రవారం ఉదయం అక్షిత్ తల్లిదండ్రులు అహ్మదాబాద్ చేరుకున్నారు. అక్షిత్ చదువుల్లో చాలా చురుకైన విద్యార్థి. భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి ఏడాదిపాటు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు. 2023లో ఐఐఎంలో సీటు రావడంతో ఎంబీఏ కోర్సులో చేరారు. అక్షిత్ ఆత్మహత్యకు ఒత్తిడే కారణమా మరేదైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

అవివాహితులకు సువర్ణావకాశం



నేడు, రేపు మేరు/దర్జి కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి. నెట్ మేరు/దర్జి కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు శనివారం(సెప్టెంబరు 28), ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 837444 5190, 800800 2165లో సంప్రదించవచ్చు.

3న ఎంఏ తెలుగు ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలకు అక్టోబరు 3న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పీఠాధిపతి ఆచార్య బి.బాబురావు శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసిన వారు ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్లో wwwpstu-cet.org వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఉంటుందని, సకాలంలో హాజరు కావాలని అన్నారు.

శరన్నవరాత్రులకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు జరిగే శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఈవో శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు ఆహ్వాన పత్రిక అందజేశారు. నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికలు, బ్రోచర్లను శుక్రవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో బొడ్డెమ్మ పండగ



భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి సన్నిధిలో శుక్రవారం బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. గత కొన్నేళ్లుగా ఆడపడుచులు ఆరాధించే కన్నెగౌరీగా బొడ్డెమ్మను కొలవడం అనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంతంలో పీట బొడ్డెమ్మను తయారు చేసి మహిళలు పూజిస్తారని ఆలయ అర్చకుడు వినయ్‌శర్మ తెలిపారు. వీరన్న ఆలయ ఆవరణలో మహిళలు రాత్రి పూట బొడ్డెమ్మ పాటలతో కోలాటం ఆడుతూ సందడి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

మండలాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో కలెక్టర్ ప్రావిణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు మండలాల అభివృద్ధికి అధికారులు తోడ్పాటు అందించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి పావిణ్యాతో కలిసి ఆయా మండలాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఆ రెండు మండలాల్లో ప్రభుత్వ భూములు సర్వే చేయాలని, అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వేలేరు మండలంలో తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి నివేదిక అందించాలన్నారు. గ్రామాలు, విద్యా సంస్థల సమస్యలపై చర్చించారు. మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఈవో వాసంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



హంటర్ రోడ్డులోని బీసీ నేత భవన్‌లో..



ఎల్కతుర్తిలో..



చింతగట్టు క్యాంపులోని ఆర్టీప కార్యాలయంలో..

స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించారు. వివిధ కుల, ప్రజా, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ సాధన కోసం ఆయన మంత్రి పదవులనే త్యాగం చేశారని, తన జీవితాన్నే అంకితం చేశారని నాయకులు శ్లాఘించారు.

– న్యూస్‌టుడే బృందం



ముచ్చర్లలో భారాస నేతలు..



కేయూలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు



శాయంపేట కాంగ్రెస్ కార్యాలయంలో...



మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



దామెర తహసీల్దార్ కార్యాలయంలో...



సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో..



పోలీస్ కమిషనరేట్‌లో..



పరకాలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి..

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
సుబేదారి 9866607449
పరకాల 9849211303

వినియోగంలోకి శుద్ధజల కేంద్రం..

ఐనవోలు గ్రామ పంచాయతీకి చెందిన శుద్ధజల కేంద్రాన్ని అధికారులు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. గ్రామంలో శుద్ధజల పరికరం పని చేయడం లేదని గ్రామస్థులు నల్లబెట్ట రాజు ఇటీవల మీమున్నాం..మీకుతోడుగాకు తెలిపారు. విషయాన్ని ఎంపీవో రఘుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి మరమ్మతు చేయించారు.

సివిల్స్‌కు సన్నద్ధమయ్యేవారికి చరిత్ర కీలకం



ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రావిణ్య

ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే: తాను ఇంజినీరింగ్ చదివినప్పటికీ సామాజిక శాస్త్రం, చరిత్ర సబ్జెక్టులు ఇష్టమని, సివిల్స్ సన్నద్ధమయ్యేవారికి చరిత్ర కీలకంగా ఉంటుందని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) చరిత్ర విభాగం ఆధ్వర్యంలో '12వ శతాబ్దం నుంచి 20 శతాబ్దం వరకు తెలంగాణ సమాజం, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్ విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో పాటు సామాజిక శాస్త్రాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న నిట్ విశ్రాంత ఆచార్యులు పాండురంగారావు మాట్లాడుతూ.. రామప్ప, వేయి స్తంభాల గుడి నుంచి మొదలైన తెలంగాణ ప్రశస్తిని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. కేయూ ఆచార్యులు కె.విజయ్‌బాబు, వి.రామచంద్ర కీలకోపన్యాసం చేశారు. అనంతరం పరిశోధక విద్యార్థులు పత్రాలు సమర్పించారు. నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. వైస్ ప్రిన్సిపల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, వివిధ కళాశాలల ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ధరలపై సీపీఐ ధర్నా



కాజీపేటలో ఆందోళన చేస్తున్న నాయకులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని, పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్మసాగర్‌లో ర్యాలీ తీసి, రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన భాజపా ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల బిక్షపతి, కొట్టె వెంకటేశ్, రాసమల్ల దీన, మాలోతు శంకర్ నాయక్, రాజయ్య, లింగయ్య, సారయ్య పాల్గొన్నారు.

చింతగట్టు(భీమారం): హసన్‌పర్తి మండల కేంద్రంలో సీపీఐ నాయకులు కూరగాయలతో వినూత్న నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు మోతె లింగారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రాజమౌళి, షేక్ బాబు, గడ్డం చంద్రమౌళి, కనకయ్య, శ్రీలత పాల్గొన్నారు.

కాజీపేట టౌన్: కాజీపేటలో నిర్వహించిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.భిక్షపతి మాట్లాడారు. నిత్యావసరాల కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిగాల భిక్షపతి, రవి, మాలోతు శంకర్‌నాయక్, వెంకటేష్, పూర్ణ చందర్, రాజమణి పాల్గొన్నారు.

అంకాపూర్‌కు రైతుల విజ్ఞాన యాత్ర



పసుపు పంటను పరిశీలిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నాబార్డు సౌజన్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఎంపిక చేసిన ఆదర్శ రైతులు విజ్ఞాన యాత్రకు వెళ్లారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌లో పసుపు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఆధునిక పద్ధతుల్లో ఎత్తుబోదెలు, జంట పద్ధతిలో పసుపు సాగు, అంతర పంటలుగా పప్పుధాన్యాలు, గడ్డి నివారణ తదితర అంశాల గురించి శాస్త్రవేత్తలు వారికి వివరించారు. వానాకాలంలో పసుపు తరువాత మిరప సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. యాసంగిలో ఎర్రజొన్న సాగు మేలని సూచించారు. రైతు విజ్ఞానయాత్రలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.రాములు, ఏఈవో సవిత, ఎంపిక చేసిన ఆదర్శరైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికలతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ మండల ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో అండర్-17 బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ మండల విద్యాధికారి రమేష్‌బాబు హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీలో 12 మంది, ఖో ఖోలో 12 మంది, వాలీబాల్‌లో 12 మంది బాలికలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి తాబేటి రాజేందర్, హెచ్ఎంలు రామారావు, జగన్నాథం, పీఈటీలు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి ఒకరి మృతి

కాజీపేట, న్యూస్‌టుడే: రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. శుక్రవారం ఉదయం జనగామ జిల్లా ఇప్పగూడ వద్ద ఈ ఘటన జరిగిందని జీఆర్ పోలీసులు తెలిపారు. కాజీపేట పోలీసులకు ఉదయం 10 గంటలకు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు జారి పడ్డాడా.. లేదా ఆత్మహత్య చేసుకున్నాడా.. అన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ముచ్చర్ల(హసన్‌పర్తి), న్యూస్‌టుడే: మాదిగలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు భిక్షపతి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం మాలల ఓట్లతోనే గెలిచానని చెప్పిన ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు పుట్ట రవి, బిర్రు మహేందర్, గద్దల సుకుమార్, బండారి సురేందర్, బొక్కల నారాయణ, ఆరెపల్లి పవన్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పర్యాటక దినోత్సవం

సుబేదారి, న్యూస్‌టుడే: సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిచారు. ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. లెఫ్టినెంట్ స్వామి, ఫ్లయింగ్ అధికారి బి.ప్రసాద్, నేహదా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాన్ని లాభాల్లోకి తెచ్చాం

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: నష్టాల్లో ఉన్న సహకార సంఘాన్ని లాభాల్లోకి తీసుకొచ్చామని సంఘం ఛైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలక వర్గంలో సుమారు రూ.2కోట్ల అవినీతి జరిగిందని, దాన్ని వడ్డీతో సహా వసూలు చేస్తామన్నారు. వైస్ ఛైర్మన్ శేషగిరి, కార్యదర్శి తిరుపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కేయూ విద్యార్థుల ఎన్‌జీఆర్ఐ సందర్శన



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశవిద్యాలయం భూగర్భశాస్త్ర విభాగ అధ్యాపకులు పి.స్వామి శరణ, కె.సాయికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని నేషనల్ జియాగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)ను సందర్శించారు. అక్కడి శాస్త్రవేత్తలతో ముచ్చటించారు. పరిశోధనలకు సంబంధించిన వివిధ ప్రయోగశాలలను, వాటిలోని పరికరాల ఉపయోగాల గురించి తెలుసుకున్నారు.

సంక్షిప్తంగా

దండేపల్లికి బస్సు సర్వీసు ప్రారంభం

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని దండేపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం అయింది. శుక్రవారం ఆర్ఎం విజయభాను గ్రామంలో జెండా ఊపి బస్సును ప్రారంభించారు. డిపో మేనేజర్ ధరమ్‌సింగ్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫొటోగ్రాఫర్ల మొదటి విడత ఎన్నికలు

కాజీపేట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం మొదటి విడత ఎన్నికలు కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాలులో శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాదు, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల నుంచి 1100 మంది వీడియో, ఫొటోగ్రాఫర్లు హాజరై ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఎన్నికల అధికారులుగా జీకే రూపాస్, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, కాజీపేట అధ్యక్షుడు జగదీశ్వర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఐనవోలు, న్యూస్‌టుడే: మామునూర్ ఏసీపీ తిరుపతి శుక్రవారం ఐనవోలు ఠాణాను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

పంగిడిపల్లి రహదారి పరిశీలన

కమలాపూర్, న్యూస్‌టుడే: కమలాపూర్ నుంచి పంగిడిపల్లి వరకు నిలిచిపోయిన రహదారి విస్తరణను శుక్రవారం అధికారులు పరిశీలించారు. విస్తరణ పనులతో భూములు కోల్పోతున్నామంటూ కొందరు రైతులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తి పనులతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామంటూ పంగిడిపల్లి నాయకులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ ప్రావిణ్యకు విన్నవించడంతో ఆమె ఆదేశాల మేరకు హనుమకొండ ఆర్డీవో ఎన్.వెంకటేశ్, ఆర్అండ్‌బీ అధికారి సురేశ్‌బాబు, డీఈఈ రాజు భాటియా, కమలాపూర్ తహసీల్దార్ సురేశ్ కుమార్ రహదారిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. విస్తరణ వల్ల కోల్పోతున్న రైతుల భూములను సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వారి వెంట నాయకులు సాంబారావు, కనకరత్నం, చరణ్‌పటేల్ ఉన్నారు.

రక్షక దళం రక్తదానం



కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేట రైల్వే రక్షక దళం, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రైజింగ్ డే సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని రక్షకదళ సిబ్బంది, రైల్వే కమర్షియల్, టెలికాం, ఇంజినీరింగ్, పీవే, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన సిబ్బంది 52 మంది రక్తదానం చేశారు. ఆర్పీఎఫ్ సీఐ సంజీవ్‌కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : హనుమకొండలోని ఆవోపా ఆధ్వర్యంలో ప్రతిభా వంతులైన విద్యార్థులకు అందించే ప్రతిభా పురస్కారాలకు ఉమ్మడి జిల్లాలోని ఆర్య వైశ్య విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆవోపా అధ్యక్షుడు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులు ఈ నెల 30 నుంచి అక్టోబరు 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440636447, 9949875510 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌యూపీపీ కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) తెలంగాణ మండల కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి సదత్ అలీ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.సారయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.సామ్రాజ్, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్.రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులుగా ఆశలత, జ్ఞాన ప్రసూనాంబ, మహిళా కార్యదర్శిగా వి.మాధవి, కార్యదర్శిగా విజయ్, జిల్లా ప్రతినిధిగా భూమలింగంను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్లా తెలిపారు.

గీతకార్మిక సంఘం కార్యవర్గం..

ఐనవోలు: పంథిని గీత కార్మిక సంఘం అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం సంఘ భవనంలో నిర్వహించారు. మొత్తం 202 ఓటర్లకు గాను 128 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బండి కుమారస్వామిగౌడ్ 24 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు శ్యామ్‌కుమార్, కుమార్ ప్రకటించారు. అనంతరం పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు వెల్లడించారు. ఉపాధ్యక్షుడు మదూరి కుమారస్వామి, గుర్రపు నర్సింహస్వామి, శ్రీశైలం, యాదగిరి, రాములు, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీవోడీటీటీగా డాక్టర్ కృష్ణారావు

ఎంజీఎం ఆసుపత్రి: రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ అధికారిగా ఉన్న డాక్టర్ ఎ.శ్రీకృష్ణారావును ప్రభుత్వం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పీవోడీటీటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్, తెలంగాణ వైద్య కళాశాల కోఆర్డినేషన్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కరోనా సమయంలో ఆయన డీఎస్‌వోగా అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ నియామకం చేసినట్లు తెలిసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కేయూ ఏఆర్ అశోక్‌బాబుకు తాఖీదు!

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం భూ ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.అశోక్‌బాబుకు పై చర్యలకు వర్సిటీ అధికార యంత్రాంగం సమాయత్తం అయింది. ప్రస్తుతం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పని చేస్తున్న ఆయనకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి తాఖీదు జారీ చేసినట్లు సమాచారం. మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నట్లు తెలిసింది.

రోబోటిక్స్ ఇన్నోవేషన్‌పై అవగాహన

మడికొండ, న్యూస్‌టుడే: ప్రాంతీయ సైన్స్ కేంద్రానికి హాజరైన వివిధ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్నోవేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌స్వామి, రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపునకు నిట్ ప్రొఫెసర్ ఆచార్య ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. యూత్ ఫర్ సేవా ప్రతినిధులు రామేశ్వర్, మల్లికార్జున్, రాజ్‌కుమార్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ.. నలుగురి అరెస్టు

మల్హర్, న్యూస్‌టుడే: ట్రాక్టర్ చోరీ సంఘటనలో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తాడిచెర్లకు చెందిన భాగమ్మ ట్రాక్టరును జూన్ 7న పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన మహేందర్, రాజులు అపహరించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన స్వామితో కలిసి భీమదేవరపల్లి మండలం ములుకనూర్‌కు చెందిన అశోక్‌కు విక్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూద కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి ఠాణా ఎల్లాపూర్ శివారులోని ఊరిగుట్టపై జూదం ఆడుతున్నట్లు సమాచారంతో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,510 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు.

అత్తపై కోడలు దాడి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ముప్పారం గ్రామానికి చెందిన కందుకూరి సుశీలను ఆమె కోడలు చందన శుక్రవారం కొట్టి గాయపరిచారు. వారం కిందట భర్తతో గొడవ జరగడంతో చందన ఇంట్లోంచి వెళ్లిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పిలవడంతో భర్త రఘువీరప్రసాద్, అత్త సుశీల ఠాణాకు వస్తుండగా చందన దాడి చేశారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ఎలుకుర్తి గ్రామానికి చెందిన మాతాంగి వెంకటయ్య(65) అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇంట్లో ఆత్మహత్యా యత్నం చేయగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందారు. కుమారుడు మాతాంగి నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు కొలిపాక సురేష్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం పొలంలో పని చేస్తుండగా నాగుపాము కాటేసింది. వెంటనే రైతు అప్రమత్తమై 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని సిబ్బంది తెలిపారు.

పరకాల నియోజకవర్గం

పోషకాహారంతో ఆరోగ్యం



పరకాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పరకాల రైతు వేదికలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఫుడ్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. పుర ఛైర్‌పర్సన్ అనిత, ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, సీడీపీవో స్వాతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భారాస అండ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బాధిత కుటుంబాలకు భారాస అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గుడెప్పాడ్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచి వీసం శ్రీనివాస్‌రెడ్డికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. శుక్రవారం ధర్మారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం గుడెప్పాడ్, పెద్దాపూర్ గ్రామానికి చెందిన భారాస కార్యకర్తలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, కుమారస్వామి, రాజేశ్వర్‌రావు, సాంబయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ బృందం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులోని పీఏసీఎస్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం హనుమకొండలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, రాజేందర్, శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా

నడికూడ, న్యూస్‌టుడే: రైతులకు రుణమాఫీ చేయాలని మండలంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం నడికూడ బస్టాండ్ కూడలి వద్ద ప్రధాన రోడ్డుపై చర్లపల్లి గ్రామ రైతులు బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

శాయంపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం శాయంపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారని, మందకృష్ణ మాదిగపై కక్ష్యపూరితంగా విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నేతలు ముఖేష్, దేవయ్య, సదయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దామెర, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై అశోక్‌తో కలిసి క్రీడలను ప్రారంభించారు. ఎంఈవో రాజేష్‌కుమార్, ఎంపీవో రంగాచారి, ఏపీవో శారద పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, పీడీ గ్రేసమ్మ, పీఈటీలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఉపాధిహామీ సాయం

దామెర, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తుందని అదనపు డీఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. సీతారాంపురంలో సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను శుక్రవారం ఆయన సందర్శించారు. రైతు మహమ్మద్ రంజాన్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఊరుగొండలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు.